## క్లుప్తంగా

### వారిజ ఆశ్రమంలో ధనుర్మాస పూజలు



పూజలు అందుకున్న లక్ష్మీ హాయగ్రీవ స్వామి

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేటలో త్రిదండి చినజీయర్ స్వామి వారిజ ఆశ్రమంలోని హయగ్రీవ మందిరంలో బుధవారం ధనుర్మాస పూజలు వైభవంగా జరిగాయి. ముందు గా శ్రీ లక్ష్మీహయ గ్రీవ స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. పూజల అనంతరం దీపాలంకరణ చేశారు.

### పోలీసుల అదుపులో వామపక్ష నాయకులు



పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో వామపక్ష నాయకులు రాజ్‌కుమార్, సత్యనారాయణ

మధురవాడ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో మధురవాడలో వామపక్ష పార్టీలకు చెందిన నాయకులను పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీలు పిలుపునిచ్చిన నేపథ్యంలో సీపీఎం నాయకుడు పి.రాజ్‌కుమార్, సీపీఐ నాయకుడు వాండ్రాసి సత్యనారాయణ తదితరులను ఉదయాన్నే అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఇతర నాయకులకు కూడా పోలీసులు ముందస్తు నోటీసులు అందజేశారు.

### ఘనంగా శ్రీరాములు నాయుడి వర్ధంతి



శ్రీరాములు నాయుడు చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

మధురవాడ: మాజీ మంత్రి గొర్లె శ్రీరాములు నాయుడు 20వ వర్ధంతిని ఉత్తరాంధ్ర తూర్పు కాపు సామాజిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం మధురవాడలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. మంత్రిగా, కాపు నాయకునిగా ఆయన చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో వేదిక మధురవాడ అధ్యక్షుడు మురళినాయుడు, తూర్పు కాపు సలహాదారు పతివాడ మార్కండేయులు, గొర్లెవెంకటరమణ, బి.రమణ, విద్యాసాగర్, చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

### మెట్ల మార్గంలో గోడ లేక అవస్థలు



మెట్ల మార్గంలో కూలిపోయిన గోడ

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీ నుంచి దగ్గర దారిలో జాతీయరహదారికి చేరుకునే మెట్ల మార్గంలో రెండు మాసాల క్రితం గోడ కూలిపోయింది. దీంతో పంచాయతీ వాసులు తగరపువలస చేరుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. గతంలో పంచాయతీ పాలకవర్గం 20 వరకు మెట్లతో పాటు ఇరువైపులా గోడ నిర్మించింది. దీంతో వృద్ధులు, చిన్నారులు, మహిళలు ఈ మార్గంలో గోడను ఆసరాగా చేసుకుని రాకపోకలు చేస్తుంటారు. ప్రస్తుతం ఒకవైపు గోడ కూలడంతో ఆసరా లేక మెట్లు, ఎక్కి దిగేటప్పుడు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుత పాలకవర్గం మెట్ల మార్గంలో శిథిలమైన గోడను పునర్నిర్మించాలని పంచాయతీ వాసులు కోరుతున్నారు.





నాడు

కొలనులో స్నానాలు చేస్తున్న బాతులు



నేడు

నిరుపయోగంగా ఉన్న పావురాలు స్నానాలు చేసే కొలను

# ఏదీ నాటి కళ?

- కళావిహీనంగా పావురాల పార్కు
- తగ్గిపోయిన పావురాళ్లు, కుందేళ్లు
- నిరాశ చెందుతున్న సందర్శకులు



పావురాల పార్కు ముఖద్వారం



కొద్దిగా మిగిలి ఉన్న కుందేళ్లు, పావురాలు.

భీమునిపట్నం: పావురాళ్లు, బాతులు, కుందేళ్లతో కళకళలాడిన పావురాల పార్కు నేడు కళావిహీనంగా దర్శనమిస్తోంది. భీమిలి బీచ్ వద్ద లైట్‌హౌస్ ఎదురుగా ఉన్న విశాలమైన ప్రాంతంలో 2004లో ఈ పార్కును ఏర్పాటు చేశారు. ముందుగా పావురాలు ఉండడంతో దీనికి పావురాల పార్కు అనే పేరు వచ్చింది. కానీ తరువాత వాటితో పాటు బాతులు, కుందేళ్లు, తాబేళ్లు ఉండేవి. వీటి కోసం ప్రత్యేకమైన షెడ్లు ఏర్పాటు చేశారు. అలాగే ఇక్కడ బాతులు స్నానాలు చేయడానికి పెద్ద తొట్టి (కొలను)ను ఏర్పాటు చేశారు. వీటి ఆహారం కోసం మున్సిపాలిటీ కొంత నగదును వెచ్చించేది. వీటిని పర్యవేక్షించడానికి ఇద్దరు సిబ్బంది ఉన్నారు.

గతంలో ఈ పార్కు ఈ ప్రాంతానికే ప్రత్యేక ఆకర్షణగా ఉండేది. పావురాళ్లు, బాతులు, తాబేళ్లు, కుందేళ్లను చూడడానికి నిత్యం సందర్శకులు వచ్చేవారు. చిన్నారులు వాటితో ఫొటోలు తీసుకునేందుకు ఆసక్తి చూపేవారు. అయితే, హుద్‌హుద్ తుపాను సమయంలో సగానికి పైగా పక్షులు, జంతువులు మృతి చెందాయి. ఇప్పుడు వాటిలో కొన్ని మాత్రమే ఉన్నాయి. సందర్శకులు బాగా తగ్గిపోయారు. దీంతో పార్కు కళ తప్పింది. అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో పార్కు దెబ్బతింటూ వస్తోంది. షెడ్లు బాగా పాడైపోయి, కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. పరిసరాలు కూడా దెబ్బతినడంతో పార్కు మొత్తం పాడైపోయింది. పరిస్థితి ఇలాగే ఉంటే మరి కొంతకాలంలో ఉన్న కొన్ని జీవులు కూడా కనుమరుగైపోతాయని జంతు ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పక్షుల సంఖ్య పెంచి, పార్కును వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

**ఇదీ పరిస్థితి**

| | నాడు | నేడు |
|---|---|---|
| పావురాలు | 120 | 2 |
| బాతులు | 20 | 5 |
| తాబేళ్లు | 10 | 3 |
| కుందేళ్లు | 20 | 2 |



పావురాలు, బాతులు ఉండే షెడ్లు

### తరచూ వెళ్లేవాళ్లం



పావురాల పార్కుకు తరచూ వెళ్లేవాళ్లం. పిల్లలు బాతులు, కుందేళ్లు, పావురాళ్లను చూసి ఎంతో సంబరపడేవారు. బంధువులు వచ్చినా తీసుకువెళ్లేవాళ్లం. కానీ ఇప్పుడు ఆ పార్కు బోసిపోయింది. చూస్తుంటే ఎంతో బాధగా ఉంది. అధికారులు స్పందించి పార్కును అభివృద్ధి చేయాలి.

– రాజేటి సంధ్య, మామిడిపాలెం

### ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం



పావురాల పార్కులో అవసరమైన పనులకు సంబంధించి అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. ఇక్కడ ఏ మేరకు మరమ్మతులు చేయాలి? ఇతర అవసరాలు ఏమిటో పరిశీలిస్తున్నాం. ఇందులో ఉండే పక్షులు, జంతువుల సంఖ్యను పెంచడానికి అవసరమైన చర్యలు కూడా తీసుకుంటాం.

జి.సురేష్, జోనల్ ఏఈ

## ఐటీ సెజ్‌లో ఉద్యోగుల ఆందోళన



నిరసన తెలుపుతున్న పల్సస్ ఉద్యోగులు

మధురవాడ: రెండు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో మధురవాడలోని విశాఖ ఐటీ సెజ్‌లో పల్సస్ ఉద్యోగులు బుధవారం ఉదయం నిరసన తెలిపారు. విధులకు వెళ్లే సమయంలో కాసేపు గేటు వద్ద నిలబడి ఆందోళన చేశారు. యాజమాన్యం ఉద్యోగులకు ఇస్తున్న రూ.18వేల జీతంలోనూ 50 శాతం కోత విధించినట్లు ఆరోపణలు ఉన్నాయి. డిగ్రీలు చదివి ఎన్నో ఆశలతో ఐటీ ఉద్యోగం అని చేరితే పండగ సమయంలో కూడా జీతం రాకపోవడంతో వీరు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఉద్యోగం మానేద్దామంటే ఒరిజినల్ సర్టిఫికెట్లు కూడా ఇవ్వడం లేదని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ పెద్దలు అయినా తక్షణమే స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. రాజకీయ ముసుగులో ఉద్యోగులను ఇబ్బందులపాలు చేస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు వస్తున్న తరుణంలో వీరు ఆందోళనకు దిగడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే భోజన విరామ సమయంలో కూడా ఉద్యోగులు బయటకు రాకుండా, మీడియాతో మాట్లాడే వీల్లేకుండా కట్టడి చేశారు.

## యూనిటీమాల్ స్థలాన్ని పరిశీలించిన మంత్రి



యూనిటీమాల్‌కు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి సవిత

కొమ్మాది: యూనిటీమాల్ నిర్మాణంతో చేనేత, హస్త కళల ఉత్పత్తులకు మార్కెట్ సదుపాయం కల్పించడంతో చేనేత కళాకారులకు ఆర్థిక భరోసా లభిస్తుందని మంత్రి ఎస్.సవిత అన్నారు. తిమ్మాపురంలోని రామానాయుడు ఫిల్మ్ స్టూడియో పక్కన ఉన్న యూనిటీమాల్‌కు కేటాయించిన స్థలాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. కేంద్రం సహకారంతో 5 ఎకరాల్లో రూ. 172 కోట్లతో భారీ భవంతి నిర్మించి సీవ్యూతో చేనేత, హస్తకళల ఉత్పత్తుల దుకాణాలు, మినీ థియేటర్లు, కన్వెన్షన్ హాల్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అటు వ్యాపారులకు, ఇటు వినోదానికి ప్రాధాన్యం ఉండేలా యూనిటీ మాల్ నిర్మించనున్నట్లు చెప్పారు. జీ ప్లస్ 4 గా నిర్మిస్తున్న ఈ భవనంలో మొదటి రెండు అంతస్తుల్లో 62 షాపులు, మూడో అంతస్తులో సముద్రాన్ని వీక్షించేలా సీవ్యూతో రెస్టారెంట్, 4వ అంతస్తులో కన్వెన్షన్ హాల్‌తో పాటు రెండు మినీ థియేటర్లు, రిటైల్ స్టోర్స్, రెస్టారెంట్లు వంటి సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు.

## వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు



కుంతీ మాధవ స్వామి

పద్మనాభం: పద్మనాభం గ్రామంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో నానాజీబాబు తెలిపారు. ఆ రోజు దయం 8.30 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనాలు ఉంటాయన్నారు. ముందుగా వేకువ జామున 3.30 గంటలకు స్వామి వారికి పంచామృతాభిషేకాలు, 7.30 గంటలకు గ్రామ సేవ అనంతరం 8.30 గంటలకు సర్వ దర్శనాలు ప్రారంభమవుతాయని చెప్పారు. సాయంత్రం 5.30 గంటలకు సహస్ర దీపాలంకరణ, 6.30 గంటలకు పుష్పయాగం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.

**అంబేడ్కర్ కాలనీలోని ఆలయంలో..**

తగరపువలస: సంతపేట అంబేడ్కర్ కాలనీలోని సీతారామ షిర్డీ సాయి సహిత ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి పూజలు నిర్వహించనున్నారు. ఆరోజు ఉదయం 4.30 నుంచి ఉత్తర ద్వార ప్రవేశం, 8 గంటల నుంచి సీతారామ లక్ష్మణ సహిత హనుమత్ స్వాములకు లక్ష తులసి అర్చన నిర్వహించనున్నట్లు అర్చకుడు బూరాడ కామేశ్వరశర్మ తెలిపారు. వివరాలకు 99664 55802లో సంప్రదించాలని కోరారు.

## రేపు కొండ కిందవరకే ద్విచక్రవాహనాలకు అనుమతి

కొమ్మాది: రుషికొండలో గల మహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయం (టీటీడీ) కొండపైకి శుక్రవారం ద్విచక్రవాహనా లు అనుమతించబోమని ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు వైకుంఠ ఏకాదశి సందర్భంగా వేలాది మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోనున్న నేపథ్యంలో కొండపై పార్కింగ్ సమస్య ఉత్పన్నమవుతుందనే ఉద్దేశంతో కేవలం కార్లను మాత్రమే కొండపైకి అనుమతిస్తున్నామని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనాలపై వచ్చే భక్తులు కొండ కిందనే పార్క్ చేసుకోవాలని సూచించారు. భక్తుల రద్దీ దృష్ట్యా మరో రెండు బస్సులను ఉచితంగా ఏర్పాటు చేశామని, ఆ బస్సుల ద్వారా కొండపైకి భక్తులు చేరుకోవచ్చని సూచించారు. భక్తు లు సహకరించాలని కోరారు.

## నేటి నుంచి శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు



శిల్పారామం

పీఎం పాలెం: జీవీఎంసీ ఆరోవార్డులోని శిల్పారామం(జాతర)లో గురువారం నుంచి 16వ తేదీ వరకు సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్లు స్థానిక పరిపాలన అధికారి టి.విశ్వనాథ రెడ్డి తెలిపారు. ప్రతీ రోజు ప్రత్యేక కార్యక్రమాలుంటాయని, ఆ వివరాలు వెల్లడించారు.

- గురువారం ఉదయం 10 గంటలకు సంక్రాంతి ముగ్గుల పోటీతో సంబరాలు ప్రారంభం.
- ఈ నెల 10వ తేదీన ఉదయం 10 గంటలకు గాలి పటాల పోటీలు. విజేతలకు బహుమతుల ప్రదానం.
- ఈ నెల 11న సాయంత్రం 6 గంటలకు నృత్య భారతి అకాడమీ ఆధ్వర్యంలో ప్రత్యేక సంక్రాంతి జానపద, కూచిపూడి నృత్య ప్రదర్శన.
- 12వ తేదీన సాయంత్రం 6 గంటలకు కళారాధన మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన.
- 13వ తేదీ సాయంత్రం 6 గంటలకు సరస్వతి నృత్య కళామందిర్ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన.
- 14వ తేదీన సంక్రాంతి సందర్భంగా సిద్ధేంద్ర యోగి నాట్యాలయం వారి ప్రత్యేక కూచిపూడి నృత్య ప్రదర్శన.
- 15వ తేదీన జోయ్స్ డ్యాన్స్ అకాడమీ కూచిపూడి నృత్య ప్రదర్శన.
- 16వ తేదీన మీనాక్షి కూచిపూడి డ్యాన్స్ అసోసియేషన్, ఎంకే ఫోక్ డ్యాన్స్ వారి శాస్త్రీయ, జానపద నృత్యప్రదర్శన.

## సుబ్బారావు శర్మకు నివాళి



సుబ్బారావు శర్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న పెద్దలు

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయం అభివృద్ధిలో, ప్రధాన అర్చకునిగా బ్రహ్మశ్రీ పట్నాల అప్పల సూర్యసుబ్బారావు శర్మ అందించిన సేవలు శ్లాఘనీయమని ఆలయ ప్రతినిధులు, పెద్దలు కొనియాడారు. బుధవారం చంద్రంపాలెంలోని ఆయన నివాసంలో కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, చంద్రంపాలెం గ్రామ పెద్దలు పిళ్లా శ్రీనివాసరావు, పిళ్లా సత్యనారాయణ, జగ్గపల్లి నాని తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

**సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ రాంబాబు**



మండల సర్వసభ్య సమావేశంలో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత శాఖ అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని ఎంపీపీ కంటుబోతు రాంబాబు అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన పద్మనాభం మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఎంపీటీసీ సభ్యుడు, సర్పంచ్ రూ.3లక్షల వరకు అభివృద్ధి పనుల కోసం కావల్సిన పని సూచిస్తూ తమకు రాతపూర్వకంగా ఇవ్వాలన్నారు. వీటిలో అవసరాలకనుగుణంగా ప్రాధాన్యత క్రమంలో మండల పరిషత్ నిధులు మంజూరు చేస్తామన్నారు.

**రెండేళ్లుగా అందని కుళాయి నీరు**

చేరిఖండం సర్పంచ్ చిన్నారావు మాట్లాడుతూ రెడ్డిపల్లి రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పైపు లైన్ కప్పేయడంతో తమ పంచాయతీ ప్రజలు రెండేళ్ల నుంచి కుళాయిల ద్వారా నీరు రాక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పైపు లైనును పునర్నిర్మించాలని కోరుతున్నప్పటికీ ఆర్ అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోలేదన్నారు. వచ్చే సమావేశంలోగా పైపు లైను పునరుద్ధరించకపోతే సర్వసభ్య సమావేశంలో కుర్చీపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తానన్నారు. రెడ్డిపల్లి హైస్కూల్ ప్లస్‌లో తగినంత అధ్యాపకులు లేరని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

- రేవిడి ఎంపీటీసీ సభ్యుడు సీర సూరప్పడు మాట్లాడుతూ రేవిడి పీహెచ్‌సీ ప్రాంగణంలో శిథిలావస్థలో ఉన్న పాత భవనాలకు సంబంధించి సామగ్రిని కొంతమంది దొంగిలించి అమ్ముకుంటున్నారన్నారు. ఈ భవనాలను తొలగించి సామగ్రిని వేలం పాట వేయాలని కోరారు.
- బీఆర్ తాళ్లవలస పంచాయతీ సర్పంచ్ చందక శ్రీను మాట్లాడుతూ తమ పంచాయతీ పరిధిలో రోడ్లు వేసేటప్పుడు ఇంజినీరింగ్ అధికారులు తమకు సమాచారం ఇవ్వలేదని మండిపడ్డారు. బీఆర్ తాళ్లవలస ఎంపీటీసీ సభ్యుడు చందక పైడినాయుడు మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనాన్ని పూర్తి చేయాలని కోరారు.
- ఆర్‌అండ్‌బీ ఏఈ శైలజ మాట్లాడుతూ రెడ్డిపల్లి గ్రామంలో రహదారుల గోతులు పూడ్చడానికి చర్యలు చేపట్టామన్నారు. దీనిపై ఎంపీపీ రాంబాబు మాట్లాడుతూ బీటీ వేయకుండా గోతులు పూడ్చడం వల్ల ప్రయోజనం లేదన్నారు. నిధుల కొరత వల్ల ప్రస్తుతం బీటీ వేయలేకపోతున్నట్టు ఏఈ బదులిచ్చారు. దీనిపై ఎంపీ మాట్లాడుతూ ఇటీవల రెడ్డిపల్లిలో రోడ్డు వేయాలని మహిళలు ధర్నా చేసినప్పుడు ఆర్‌అండ్‌బీ డీఈ 21వ తేదీ నుంచి బీటీ వేస్తామని ఎందుకు హామీ ఇచ్చారని ప్రశ్నించారు. అవసరమైతే మండల పరిషత్ నిధులు మంజూరు చేస్తామని, ఈ రోడ్డును బీటీ చేయాలన్నారు. శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి, మండల పరిషత్ ఏవో జయ ఉమ, మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంపీఎస్ చలం, రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి స్వప్న, ఎంఈవోలు రమణ, బాబూలాల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## చురుగ్గా రింగ్‌రోడ్డు పనులు



లక్ష్మీపురం ప్రారంభంలో నిర్మించిన సీసీ రోడ్డు



గెడ్డ పక్కన రహదారి నిర్మాణానికి నిర్మిస్తున్న రక్షణగోడ

తగరపువలస: భీమిలి మండలం లక్ష్మీపురం పంచాయతీలో రింగ్‌రోడ్డు నిర్మాణం చకచకా సాగుతోంది. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే లక్ష్మీపురంతో పాటు శింగనబంద, నారాయణరాజుపేట పంచాయతీ వాసులకు రాకపోకలు సాగించేందుకు మార్గంతో పాటు సమయం కలిసి రానుంది. ప్రస్తుతం లక్ష్మీపురం, శింగనబంద, నారాయణరాజు పేట పంచాయతీ వాసులు మజ్జివలస రాస పోలమాంబ ఆలయం ముందు నుంచి చుట్టూ తిరిగి వెళ్లవలసి వస్తోంది.

**మూడు పంచాయతీలకు మార్గం సుగమం**

మహరాజుపేట-రేవిడి బీటీ రోడ్డును కలుపుకొని సురాల వారి కళ్లాలు, అమ్మవారి ఆలయం, శ్మశానవాటిక మీదుగా లక్ష్మీపురం కళ్లాలను ఆనుకుని నేరుగా గ్రామ సచివాలయం వద్దకు చేరుకునేలా సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. తమకు ఈ రింగ్‌రోడ్డు ఎంతో ఉపయోగకరంగా ఉండటంతో స్థానిక రైతులు తమ పంట భూములను కూడా కొంతవరకు త్యాగం చేశారు. ఈ రింగ్‌రోడ్డుకు అనుసంధానంగా మిగిలిన వీధులను కూడా కలుపుతున్నారు. గెడ్డ ప్రాంతాలలో రక్షణగోడ నిర్మిస్తున్నారు.ఈ రింగ్ రోడ్డు కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో గడప గడప నిధులు రూ.20 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.22 లక్షలు, పంచాయతీ నిధులు రూ.4 లక్షలు, ఉపాధి హామీ నిధులు రూ.15 లక్షలు మంజూరుచేయగా పెండింగ్ పనులు పూర్తి చేయడానికి కూటమి ప్రభుత్వం మరో 37.50 లక్షలు ఉపాధి హామీ నిధులను మంజూరు చేసింది. సుమారు రూ.కోటితో నిర్మితమవుతున్న సీసీ రోడ్డు పనులు 60 శాతం పైగా పూర్తయ్యాయి. ఈ రహదారి పూర్తయితే పంచాయతీ చుట్టూ తిరిగే బాధ తప్పుతుందని మూడు పంచాయతీల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.